

ఉపాధి అవకాశాలతో వృద్ధి సాధించాలి: దాట్ల


ప్రజాశక్తి - తాళ్లరేవు


హోటల్ ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ దాట్ల

స్థానిక ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత అభివృద్ధి సాధించాలని ఎంఎల్ఎ దాట్ల సుబ్బ రాజు అన్నారు. మంగళవారం తాళ్లరేవు బైపాస్‌లో మిస్టర్ చాయ్ హోటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ, యువకులు ఉపాధి కోసం వలసలు పోకుండా, స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హోటల్ యజమాని మేడిశెట్టి రాము, గుత్తుల సాయి, కుడుపూడి శివన్నారాయణ, వేగేశ్న భాస్కరరాజు, బికుమూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేతల ఎదురుచూపులు..!

- నామినేటెడ్ పదవుల పందేరం ఎప్పుడో
- మంతనాలను ముమ్మరం చేసిన నాయకులు
- ముఖ్యనేతల చుట్టూ తప్పని ప్రదక్షిణలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

త్వరలోనే నామినేటెడ్ పదవులను నియమించే అవకాశం ఉన్నందున కూటమి నేతలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ పోస్టుల కోసం అనేకమంది ఆశావహులు అని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన ఎంఎల్ఎలు, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తమ ప్రతిపాదనలను ముందు ఉంచుతున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నామినేటెడ్ పదవులను భర్తీ చేయడం జరుగుతుంటుంది. ఈ నేపథ్యంలో పదవులను ఆశించే వారి సంఖ్య పెరుగుతోంది.

వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టుల పంపకాలపై కూటమిలో ఇప్పటికే చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. సొసైటీ, ప్రత్యేక బాడీల్లో ఉన్న పోస్టులను భర్తీ చేసే అవకాశం కనిపిస్తోంది. దీంతో కూటమిలోని పార్టీలు ఏ పార్టీకి ఎన్ని పోస్టులు ఇవ్వాలి, ఏ పోస్టులు ఎవరికి ఇవ్వాలి అనే అంశంపై కసరత్తులు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. 2014-19 టిడిపి అధికారంలో ఉన్న సమయంలో బిజెపికి, జనసేనకు ఎలాంటి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇవ్వలేదు. జనసేన కూడా ప్రత్యక్షంగా ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో ఆ ప్రస్తావన కూడా రాలేదు. అయితే ఈసారి భారీ విజయం సాధించడంలో జనసేన కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో ఆ పార్టీ కొన్ని ముఖ్యమైన పదవులను కోరే అవకాశం కనిపిస్తోంది. టిడిపి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో టిడిపి నేతలకు 50 శాతం కంటే ఎక్కువగా పదవులు కట్టబెట్టే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో కూడా జనసేన ముఖ్య నాయకులకు మెజారిటీ పదవులు లభించే ఛాన్స్ ఉంది. మూడేళ్ల వరకు ఎంఎల్‌సి పోస్టులు కూడా ఖాళీ అయ్యే అవకాశం లేదు. కేవలం ఐదు ఖాళీలు మాత్రమే వచ్చే ఏడాది రానున్నాయి. మాజీ మంత్రులు, సీనియర్ నాయకులు కూడా నామినేటెడ్ పోస్టులను దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు కూటమిలో ఎవరికి ఏ పోస్టు దక్కుతుందో వేచిచూడాల్సి ఉంది. టిడిపిలో నామినేటెడ్ పోస్టులను కోరుతున్న వారిలో ఆశావహులు జిల్లాలో భారీగానే ఉన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ఆలయ కమిటీలు, కౌడా ఛైర్మన్, డైరెక్టర్లు, టిటిడి ట్రస్టు బోర్డు సభ్యులు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, డిసిసిబి, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఇలా పలు కీలక పదవులు ఆపార్టీ నేతలకు దక్కే అవకాశాలున్నాయి. వీటితో పాటు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు కూడా వచ్చే ఛాన్స్ ఉంది.

ఆశావహులు ఎక్కువే

సదరు పదవులను త్వరలోనే నియమించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అనేకమంది ఆశావహులు జిల్లాకు చెందిన ముఖ్య నేతలతో మంతనాలు జరుపుతున్నారు. గత 10 ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడిన వారు, కష్టకాలంలో పార్టీని పోషించిన వాళ్ళు ప్రధానంగా ఈ పోస్టులకై ఆశలు పెట్టుకున్నారు. దీంతో పోటీ తీవ్రంగా ఉంది. ఎవరికి ఈ పదవులు దక్కుతాయనేది ఇప్పుడు జిల్లా అంతటా చర్చనీయాంశంగా మారింది. జిల్లాకు చెందిన మంత్రులు ఎవరి పేర్లను ప్రతిపాదిస్తే వాళ్లకే పదవులు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సీట్లు దక్కని వాళ్లకే తొలి ప్రాధాన్యత

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో సీట్లు ఆశించిన దక్కని వాళ్లకే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తొలి ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. టిడిపి జిల్లా అధ్యక్షుడుగా ఉన్న మెట్ట ప్రాంతానికి చెందిన జ్యోతుల నవీన్ కాకినాడ ఎంపి సీటుని ఆశించారు. కానీ పొత్తులోభాగంగా జనసేనకు కేటాయించారు. ఇప్పుడు ఆయనకు డిసిసిబి ఛైర్మన్ పదవి ఇవ్వాలని ఆయన అనుచరులు కోరుతున్నట్లు సమాచారం. ఇప్పటికే కీలక పదవి కోసం చంద్రబాబు వద్ద నవీన్ ప్రతిపాదన పెట్టినట్లు తెలుస్తోంది. అలాగే కుడా ఛైర్మన్ పదవి కోసం కాకినాడ సిటీ నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నేత గట్టి సత్యనారాయణ గట్టి ప్రయత్నాలే సాగిస్తున్నారు. అలాగే కాకినాడలో ముత్తా గోపాలకృష్ణ మాజీ మంత్రిగా పని చేశారు. ఆయన కుమారుడు ముత్తా నవీన్ జనసేన సిటీ ఇన్‌ఛార్జ్‌గా పని చేస్తున్నారు. ఆయన కూడా కీలక నామినేటెడ్ పోస్ట్ కోసం పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. పిఠాపురం నియోజకవర్గం సీటుని పవన్ కోసం త్యాగం చేశానని చెప్పుకుంటున్న మాజీ ఎంఎల్ఎ వర్మ కూడా ఎంఎల్‌సి వైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఆయనకు ఎంఎల్‌సి ఇస్తామని గతంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ఇప్పట్లో ఆ పదవి భర్తీ అయ్యే అవకాశం లేదు. ఇటీవల రెండు ఎంఎల్‌సిలకు వేరే నాయకులను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన కీలక పోస్ట్ కోరుతున్నట్లుగా సమాచారం. పిఠాపురంలో కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ పాద శ్రీవల్లభ గుడి, శ్రీ సంస్థాన సత్రం ఇలా కొన్ని కీలక దైవిక పదవులను ఇటీవల వైసిపి నుంచి జనసేన గూటికి చేరిన కొంతమంది నాయకులు ఆశిస్తున్నట్లుగా జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే సీనియర్లను కాదని తాజాగా చేరిన వారికి ప్రాధాన్యత ఇస్తే వ్యతిరేకిస్తామని ఆది నుంచి జనసేనలో ఉన్న పలువురు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి దంపతులు నానాజీ గెలుపు కోసం కృషి చేశారు. పిల్లి అనంత లక్ష్మి లేదా ఆమె భర్త సత్యనారాయణ కూడా నామినేటెడ్ పోస్టులను ఆశిస్తున్నారు. అలాగే టిడిపి నుంచి సీట్లు ఆశించి బంగపడిన సీనియర్ నేతలు గుణ్ణం చంద్రమౌళి, బొడ్డు వెంకట రమణ చౌదరిలు కూడా పదవులు ఆశించే వారిలో ముందున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు కేంద్ర నాయకురాలు బేబిరాణి

4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్ లు రద్దు చేయాలని సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి. బేబిరాణి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక యుటిఎఫ్ హోంలో సిఐటియు నగర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ నాయకులు పలివెల వీరబాబు, ఎంకె.జ్యోతి, భారతి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మిక హక్కుల పట్ల కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ కార్పొరేట్‌ల కొమ్ము కాస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కనీస వేతనాలు సవరించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. స్కీం వర్కర్స్ వంటి చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. నగరంలో కొత్త రంగాలకు విస్తరించి సిఐటియును బలోపేతం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.వెంకట్రావు, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షు రాలు నర్ల ఈశ్వరి మాట్లాడారు. తొలుత సంతాప తీర్మానాన్ని దుంపల ప్రసాద్ ప్రవేశపెట్టారు. అమరవీరులకు నివాళులర్పించారు.

నూతన కమిటీ ఏర్పాటు

ఈ సందర్భంగా మలక వెంకట రమణ కన్వీనర్‌గా నగర నూతన సమన్వయ కమిటీని ఎంపిక చేశారు. పలివెల వీరబాబు, దుంపల ప్రసాద్, ఎం.రమణమ్మ, ఎంకె జ్యోతి, భారతి సహాయ కన్వీనర్లుగా అంగన్‌వాడీ నీరజ, రామలక్ష్మి, ఆశా పద్మ, మెడికల్ రిప్స్ స్వామి, సత్య శ్రీనివాస్, జిజిహెచ్ శానిటేషన్ సిహెచ్.విజయ్ కుమార్, ఎం.రవి, ఆర్.తలుపులమ్మ, జిజిహెచ్ మెస్ ఎ.ఏడుకొండలు, పోర్ట్ సర్వే అండ్ టాలీ సూర్యారావు, మున్సిపల్ డ్రైవర్స్ ఎం.సూర్య ప్రకాష్, క్లాప్ వాహన డ్రైవర్స్ సంతోష్, ఇస్మాయిల్, తదితరులతో మరికొన్ని సంఘాల నుండి కో ఆప్షన్ సభ్యులతో నూతన కమిటీ ఏర్పడింది.

నేడు డిమాండ్స్ డేను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

నేడు జరిగే కార్మికుల డిమాండ్స్‌ను కార్మికులు జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో గడిగట్ల సత్తిబాబు అధ్యక్షతన సిఐటియు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర పార్టీలపై ఆధారపడి బిజెపి కూటమి పేరుతో ప్రభుత్వం ఏర్పాటు చేసినా కార్మికులపై భారాలు మోపడం ఆపలేదన్నారు లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. బిజెపి ఆధ్వర్యంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం జరుగుతున్న ధర్నాల్లో సిఐటియు అనుబంధ కార్మిక సంఘాలన్నీ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఎస్.శ్రీనివాస్, సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల నాయకులు కరక సుబ్బలక్ష్మి, గాడి సత్యవతి, మరిడమ్మ తల్లి, తైనాల శ్రీను, పాండవ గిరి, వడ్డి సత్యనారాయణ, వామిశెట్టి స్వామి, ఎన్ సూరిబాబు పాల్గొన్నారు.

ఎస్ఐ మృతికి కారకులను శిక్షించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు వేధింపులు తట్టుకోలేక శ్రీనివాస్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. మృతుడు శ్రీనివాస్ భార్య ఫిర్యాదు మేరకు దోషులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల్లో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని గొంచాల, నవర గ్రామాల్లోని పాఠశాలలను ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య మంగళ వారం తనిఖీలు చేశారు. ప్రతి తరగతి విద్యార్థుల వర్క్ బుక్, టెక్స్ట్ బుక్ కరెక్షన్స్, సిలబస్‌ను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ వాటిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.


నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఇఒ

డ్వాక్రా యనిమేటర్‌పై అధికారుల విచారణ

ప్రజాశక్తి - పిఠాపురం


డ్వాక్రా మహిళల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

తమ డ్వాక్రా సంఘాల పేరుతో బ్యాంకుల నుంచి కోట్లాది రూపాయలు డ్వాక్రా యేనిమేటర్ రుణాలు తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై డిఆర్‌డిఎ అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని బి.కొత్తూరు గ్రామానికి చెందిన పలు డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలు తమ గ్రామంలో 58 డ్వాక్రా సంఘాల గ్రూపులు ఉన్నాయని, తమ సంఘాలకు యేనిమేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పిఠాపురానికి చెందిన దారా పద్మకుమారి చైతన్య గోదావరి, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇతర మరో బ్యాంకు నుంచి ఇతర ప్రాంతాలకు చెందిన వారిని సభ్యులుగా చేర్చి రూ.6 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకూ రుణాలు తీసుకున్నట్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై డిఆర్‌డిఎ డిపిఎం వి.పద్మావతి, పిఠాపురం వెలుగు ఎపిఎం సిహెచ్.ప్రియదర్శిని మంగళ వారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా 30 గ్రూపులకు చెందిన మహిళలను విచారించారు. ఈ విచారణలో 15 గ్రూపులు సక్రమంగా రుణాలు తీసుకున్నట్లు, మరో 15 గ్రూపులు సభ్యులు తాము రుణాలు తీసుకోలేదని అధికారులకు వెల్లడించారు. ఇటీవల కాలంలో బ్యాంకు మేనేజర్ స్వామి యేనిమేటర్ పద్మకుమారి నుంచి రూ.50 లక్షలు రికవరీ చేసినట్లు ఎపిఎం ప్రియదర్శిని తెలిపారు. విచారణలో సుమారు రూ.60 లక్షలు అక్రమంగా రుణాలు పొందినట్లు అధికారులు గుర్తించారు. మరికొంతమంది గ్రూప్ సభ్యులను విచారణ చేస్తే యానిమేటర్ ఎంత మొత్తంలో అక్రమాలకు పాల్పడిందనేది తెలుస్తుందని అధికారులు మీడియా వెల్లడించారు.

దళారీ వ్యవస్థ లేకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ


సమావేశంలో మాట్లాడుతున్న చెక్కల రాజ్‌కుమార్

ఉచిత ఇసుక విధానంలో దళారీ వ్యవస్థ లేకుండా చర్యలు తీసుకోవాలని ఎపి భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం (సిఐటియు అనుబంధం) డిమాండ్ చేసింది. మంగళ వారం స్థానిక కచేరి పేటలోని లక్ష్మీదాస్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షులు నిట్ల శ్రీను అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడారు. గత ఐదేళ్లలో వైసిపి పాలనలో నిర్మాణ రంగాన్ని సర్వ నాశనం అయిందని, ఇసుక సమస్య, సంక్షేమ పథకాల నిలుపుదల, కార్మికుల సొమ్ము తరలింపు వంటి చర్యలతో కార్మికుల కుటుంబాలను రోడ్డు పాలు చేసిందని విమర్శించారు. అందుకు తగిన ఫలితాన్ని వైసిపి అనుభవించిందన్నారు. నూతన ప్రభుత్వం తక్షణమే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించడం తోపాటు, 1214 మెమోని తక్షణం రద్దు చేయాలని, పెండింగ్లో ఉన్న క్లయిముల పరిహారాలను తక్షణం కార్మికులకు చెల్లించాలని, గత ఐదేళ్ల కాలంలో ప్రమాద మరణాలు, ఇతర అనారోగ్య కారణాలతో చనిపోయిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉచిత ఇసుక నిర్ణయం అబాసుపాలు కాకుండా మధ్య దళారీ వ్యవస్థను నిర్మూలించాలని కోరారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రాల్లో మోడీ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ జరిగే ఆందోళనలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలని, 20వ తేదీ లోపు ఎంఎల్ఎలు అందరినీ కలిసి అన్ని యూనియన్లకు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని, సంక్షేమబోర్డును ప్రారంభించాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ మెడిశెట్టి వెంకట రమణ, వాసంశెట్టి వెంకటరమణ, ప్రకృతి ఈశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు వాకాడ సురేష్, జీవా, సురేంద్ర, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

'డిప్యూటీ సిఎం సూచనలు హర్షణీయం'

ప్రజాశక్తి - గండేపల్లి



పర్యావరణ పరిరక్షణపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన సూచనలు హర్షణీయమని జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత, శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ అన్నారు. మంగళవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తీసుకుంటున్న చొరవ తమలాంటి వారికి ఎంతో స్ఫూర్తిని ఇస్తుందన్నారు. వినాయక చవితి సమీపిస్తున్న నేపథ్యంలో పర్యావరణ హితం కోరుతూ మట్టి వినాయకులనే పూజించాలని ఇచ్చిన పవన్ కళ్యాణ్ పిలుపునకు అనూహ్యంగా స్పందన వచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తమ సమితి ఆధ్వర్యంలో గత 2 దశాబ్దాలుగా మట్టి వినాయక ప్రతిమలు పంచుతున్నామని, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 7న ప్రారంభం అయ్యే వినాయక చవితికి ఇప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణకు అడుగులు వేయాల్సివుందని అన్నారు. పవన్ పిలుపుతో వినాయక చవితి పర్యావరణ హితంగా జరుపుకుంటారనే నమ్మకం కల్గిందని ఆనందం వ్యక్తం చేశారు.

సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఖరీఫ్ సీజన్లో ప్రతి పంటకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. మంగళవారం మండలంలో పంట కాలువల పూడికతీత పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ దగ్గర కావడంతో కాలువల పూడికతీత పనులను మూడు భాగాలుగా విభజించి వేగవంతం చేయడం జరిగిందన్నారు. ఏలేశ్వరం, లింగంపర్తి, బద్రవరం గ్రామాల పరిధిలో పంట కాలువల పూడికతితల పనులు యుద్ధ ప్రాతిపదిక మీద నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, కూటమి నాయకులు పరుపుల తమ్మయ్యబాబు, బాలుదొర, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొద్దిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి, పెంద్ర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతులను సత్కరించిన సర్పంచ్

ప్రజాశక్తి - కిర్లంపూడి

జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను మండలంలోని జగపతినగరం పంచాయతీ సర్పంచ్ గుడాల శ్రీలత ఘనంగా సత్కరించారు. ఎంఎల్ఎగా విజయం సాధించిన తరువాత తొలసారిగా ఆయన మంగళవారం గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సర్పంచ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుడాల శ్రీలత మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నిర్వాకం వల్ల పంచాయతీలో నిధులలేమితో ఉందన్నారు. ఎంఎల్ఎ సహకారంతో గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. పంచాయతీలో నిధుల లేకపోయినా ప్రతీ నెల పారిశుధ్య కార్మికులకు జీతాలను చెల్లిస్తున్న సర్పంచ్‌ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చదరం చంటిబాబు, నాయకులు తూము కుమార్, కుర్ల చిన్నబాబు, కాళ్ళ వెంకటేష్, ఆళ్ల శ్రీమన్నారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎన్‌టిఆర్.రమేష్ బాబు,ఉప సర్పంచ్ గౌతు జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

యానాం రిసార్ట్స్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలానికి చెందిన ఇంజరం పంచాయతీ పరిధిలో ఉన్న యానాం రిసార్ట్స్‌ను రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా రిసార్ట్ భవనాలు నిర్మించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆర్‌డిఒ కిషోర్ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, ఆర్ఐ రవితేజ, సర్వేయర్ షఫీ, విఆర్‌ఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇకపై కార్మికులకు చేతినిండా పని

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల నిర్మాణ రంగంలో ఉన్న కార్మికులందరికీ చేతినిండా పని లభిస్తుందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి అన్నారు. మంగళవారం స్థానిక ఎడిబి రోడ్డులో ఇసుక డెలివరీ పాయింట్ వద్ద ఆయన ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత విధానం ద్వారా ఇసుక నామమాత్రపు ధరకే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం ద్వారా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ జె.సీతారామారావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, నిమ్మకాయల రంగనాగ్, తూతిక రాజు, విత్తనాల వెంకటరమణ, ఓబిలిశెట్టి గణేష్ పాల్గొన్నారు.

పురుషోత్తపట్నం నుంచి నీటి విడుదల

ప్రజాశక్తి - జగ్గంపేట


స్విచ్ ఆన్ చేస్తున్న ఎంఎల్ఎలు జ్యోతుల, సత్యప్రభ

మండలంలోని రామవరం గ్రామంలో పురుషోత్తపట్నం ఫేస్-2 నుంచి మంగళవారం సాగునీటిని విడుదల చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎలు జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు. తొలుత గోదావరి నీటికి హారతి ఇచ్చి, ఎంఎల్ఎలు పంపులకు సంబంధించి స్విచ్‌లను ఆన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ రావాల్సివుందని, అనివార్య కారణాల వల్ల రాలేకపోవడంతో తమ చేతుల మీదుగా ప్రారంభం చాల్సివచ్చిందన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో పథకం ఫలాలను రైతులకు అందకుండా పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల వ్యవధిలోనే పంపులకు మరమ్మతులు చేపట్టి మెట్ట రైతులకు సాగునీటిని అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్, నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, ఆడబాల వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.


పురుగు మందుల దుకాణంలో తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

మండలం వేట్లపాలెంలోని సత్య సాయి ఏజెన్సీస్ ఎరువుల షాపులో వ్యవసాయ శాఖ ప్రత్యేక స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. మంగళవారం జరిగిన ఈ తనిఖీల్లో ఎరువులు, పురుగు మందుల స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, నిల్వలను పరిశీలించారు. నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు మాత్రమే రైతులకు విక్రయించాలని డీలర్లను ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ శాఖ డిడిఎ కె.త్రినాథస్వామి, డివివి.సతీష్, కాకినాడ జిల్లా వ్యవసాయ శాఖ టెక్నికల్ ఎఒ ఎన్. విజయలక్ష్మి, సామర్లకోట మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



లయన్స్ అధ్యక్షునిగా డాక్టర్ అనసూరి



ప్రమాణస్వీకారంలో మాట్లాడుతున్న డాక్టర్ అనసూరి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా ప్రముఖ నేత్ర వైద్యులు అనసూరి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వ రావు మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ద్వారా ఏలేశ్వరంలో పేదలకు సేవలందించే అవకాశం దక్కిందన్నారు. ఏలేశ్వరంతోపాటు, ఏజెన్సీ ప్రాంతాల్లోనూ మెడికల్ క్యాంపులు, ఇతర సేవ కార్యక్రమాలు కొనసాగిస్తా మన్నారు. మినర్వా విద్యాసంస్థల అధినేత డివిఎస్.రాజు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా 189 దేశాల్లో తమ సేవలను అందిస్తుందన్నారు. లయన్స్ క్లబ్ సభ్యునిగా సేవలు అందించడం గర్వకారణమన్నారు. నూతన కార్యదర్శిగా పూర రాజబాబు, కోశాధికారిగా కప్పల నాగభూషణం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ గవర్నర్ కెవి సుబ్బరాజు, రీజన్ ఛైర్‌పర్సన్ వై.రామకృష్ణ, జోన్ ఛైర్మన్ పిఇ.భరద్వాజ్, జ్యోతుల నాగసత్యశ్రీనివాస్, ఎడివి.ప్రసాద్, నడిమింటి ప్రసాద్, చందువోలు రాజా, డాక్టర్ సునీల్, డాక్టర్ ఆఫీజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ భవన నిర్మాణం వేగవంతం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కాకినాడ


నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వనమాడి

విశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న కాకినాడ నగరపాలక సంస్థ నూతన భవనాన్ని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, ఇతర అధికారులతో కలిసి సినిమా రోడ్ లో నిర్మిస్తున్న నూతన భవనం పనులను పరిశీలించారు. పనుల ప్రగతిని కమిషనర్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.38 కోట్ల స్మార్ట్ సిటీ నిధులు, రూ.20 కోట్ల నగరపాలక సంస్థ నిధులతో ప్రతిపాదించిన కార్పొరేషన్ భవనం నాలుగేళుగడిచినా పూర్తి కాకపోవడం విచారకర మన్నారు. పన్నుల రూపంలో ఏటా రూ.77 కోట్లు వసూలవుతున్నప్పటికీ కార్పొరేషన్‌కు సొంత భవనాన్ని రూపొందించుకోలేక పోయామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన నిర్లక్ష్యం వల్లే పనులు కుంటుపడ్డాయని వనమాడి విమర్శించారు. అవసరమైతే నగర పాలక సంస్థ నిధులు ద్వారా పనులు వేగం గా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్య కుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, స్మార్ట్ సిటీ ఎస్ఇ వెంకటరావు, ఎంహెచ్ఒ డాక్టర్ పధ్వీచరణ్, టిడిపి నగర అధ్యక్షుడు మల్లి పూడి వీరు, తుమ్మల రమేష్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


పిడిఎస్ బియ్యం స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-అమలాపురం

అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని మంగళవారం అధికారులు స్వాధీనం చేసుకుని పలువురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. వివరాలు ఇవి.. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కోటనందూరులో మహాలక్ష్మి రైస్‌మిల్ నందు విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ సివిల్ సప్లయ్స్ అధికారులతో కలిసి తనిఖీ చేసి అక్రమంగా నిల్వ ఉన్న సుమారు 25300 కేజీల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. దీనికి సంబంధించి పోతల రాంబాబు, శెట్టి శ్రీనివాసరావ్, కోన ప్రభుదాస్, మోహన్ లాల్ యాదవ్, ఆనంద్ దేవాంగన్ సంబందిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు కొరకు కోటనందూరు పోలీసులకు సిఫారసు చేశారు. అనంతరం అధికారులు పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రు. 40,93,548 నిర్ధారించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాయవరం మండలంలో మాచవరం గ్రామంలో సరిట వీధి ఏరియాలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ. 1,09,700 విలువ గల 2411 కేజీల పిడిఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి మేడపాటి రామారెడ్డి సంబందిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు కొరకు రాయవరం పోలీస్ స్టేషన్ కు సిఫారసుచేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఎస్ఐ జగన్నాధరెడ్డి, ఎఒ భార్గవ మహేష్, ఎజి లక్ష్మీనారాయణ, డిసిటిఒ నవీన్ కుమార్, పిసిఎస్‌లోవరాజు, వలీ, వీరబాబు, శివ సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎరువుల దుకాణాలపై 'విజిలెన్స్' తనిఖీలు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలో మంగళవారం ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ మరియు విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. సీతానగరం, చినకొండేపూడి, బొబ్బిల్లంక, రఘుదేవపురం దుకాణాల్లో పలు రకాల రికార్డులను పరిశీలించారు. అనుమానం అనిపించిన ఎరువుల శాంపిళ్ళను నాణ్యత నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. అనంతరము ఎరువుల బస్తాలను తూకం వేసి బస్తాలో ఎరువులు 50 కేజీలు ఉన్నవో లేదో అని పరిశీలించారు. నాణ్యత లేని ఎరువులు, పురుగు మందులు అమ్మితే చర్యలు తీసుకుంటామని దుకాణ యజమాను దారులను హెచ్చరించారు .ఈ తనిఖీల్లో డిడిఎ మోహనరావు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారి సింహాచలం, కోరుకొండ ఎడిఎ మల్లిఖార్జునరావు, టెక్నికల్ ఎఒ శివశ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కె.సూర్య రమేష్ హాజరయ్యారు.

ముమ్మిడివరంలో క్షుద్రపూజల కలకలం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బళ్ల గేటు సెంటర్ లోని స్థానిక పోలీస్ క్వార్టర్స్ వెనుక ఒక నివాస గృహంలో గత 15 రోజులుగా క్షుద్ర పూజలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అక్కడ ఉన్న వారు సాయంత్రం బయటికి రావాలంటే భయపడుతున్నామంటున్నారు. అయితే దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమ మీద ఏమైనా క్షుద్ర పూజలు ప్రయోగం చేస్తారేమోనని సలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే దీనిపై స్థానికులు ముమ్మిడివరం పోలీసులకు సమాచారం అందించడంతో ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్ బాబు ఆ వ్యక్తిని స్టేషన్ కు పిలిపించి విచారించారు. తాను ఇంట్లో పూజలు చేసుకుంటున్నానని తనంటే కిట్టినవారు ఈ రకంగా ప్రచారం చేస్తున్నారన్నారు. తనను ఇల్లు ఖాళీ చేయమని ఒత్తిడి చేస్తున్న ఖాళీ చేయకపోవడంతో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపినట్లు సమాచారం. తనపై వస్తున్న ఆరోపణలతో అతను ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు తెలిసింది.

పురుషోత్తపట్నం ఫెర్రీ రేవు వేలం

ప్రజాశక్తి-సీతానగరం

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం పురుషోత్తపట్నం నుంచి పోలవరం గ్రామానికి ఫెర్రీ రేవు వేలం పాటను ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫెర్రీ రేవు పాటను పాలడుగు రత్నాజీ రావు రూ. 16,42,599కు టెండర్ ద్వారా దక్కించుకున్నారని జిల్లా పరిషత్ కాకినాడ అధికారి సిహెచ్.శాస్త్రి అన్నారు. ఈ సందర్భంగా సిహెచ్.శాస్త్రి మాట్లాడుతూ రేవు పాటకు ముగ్గురు పాటదారులు పాల్గొనగా అందులో ఒకరు డిస్క్ క్వాలిఫై అయ్యారని తెలిపారు. చివరకు ఇద్దరు మాత్రమే పాటలో పాల్గొనగా పాటను రత్నాజీ రావుకు హెచ్చు పాటగా ఖరారు చేశామని అన్నారు. రేవు దాటించడానికి ఆరు సంవత్సరాలు కలిగిన పిల్లలకు రూ. 25 ఛార్జ్ చేయబడుతుందన్నారు. ద్విచక్ర వాహనానికి రూ. 50, ద్విచక్ర వాహనం మరియు వ్యక్తికి రూ. 75, మేక లేక గొర్రెకు రూ. 25, పందికి రూ. 50, ఆవు,దున్న, ఎద్దు, గేదెకు రూ. 250, ఛార్జ్ చేయబడుతుందన్నారు. లగేజీ 25 కేజీల లోపు రూ. 15 ,లగేజీ 50 కేజీల లోపు రూ. 25 చార్జీలను రేవు పాట దారులకు ప్రజలు ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. ఈ రేవు రెండు జిల్లాలకు చెందినదిగా కలిగి ఉందని తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా వారికి ఈ పాటలో వచ్చిన మొత్తాన్ని చెరిసగం అందజేస్తారని అన్నారు. అందులో జిల్లా ఆదాయాన్ని 100 శాతంగా పరిగణించి పంచాయతీకి, మండల పరిషత్‌కు,జిల్లా పరిషత్ కు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో పోలవరం మండల ఎంపిడిఒ శ్రీను, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, సీతానగరం మండల ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, సీతానగరం మండలం ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్, సీతానగరం మండల ఇఒపిఆర్‌డి మూర్తి, చల్లమళ్ళ సుజీరాజు, పురుషోత్తపట్నం గ్రామ కార్యదర్శి మున్నీదీప్తి, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు


అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఎ అశోక్

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక బెజవాడ గార్డెన్‌లోని ఎంఎల్ఎ కార్యాలయంలో అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గ వ్యాప్తంగా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కొత్తగా మరికొన్ని పనులు చేపట్టాలని అందుకు సంబంధించి టెండర్లకు పిలవాలని కోరారు. అనంతరం అధికారులతో కలిసి రాజీవ్ బీచ్‌ను పరిశీలించారు. వరద నీరు చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యాటకులను ఆకర్షించేందుకు బీచ్ లో 'ఐ లవ్ యానాం' లోగోను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, పిడబ్ల్యూడి ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ళ నాగరాజు, జెఇలు భాస్కర్, భగవాన్, ప్రసాద్ పాల్గొన్నారు.


రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని ఎంఎల్ఎను కోరుతున్న మహిళలు

రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట గణపతి నగర్‌లో రోడ్లు డ్రెయిన్లు నిర్మించాలనిగ్రామ మహిళలు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందించారు. ఎన్నో ఏళ్లుగా రోడ్లు డ్రెయినేజీలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాడకం నీరు ఇంటి ముందే ఉండడంతో దోమలు పేరుకుపోయి వ్యాధులు బారిన పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ అశోక్ మాట్లాడుతూ ఎంఎల్ఎ నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సివుందని, ఆ నిధులు రాగానే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక చెల్లి గార్డెన్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణ పనులను పరిశీలించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పిఠాపురం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కిషోర్

నియోజవర్గవ్యాప్తంగా నిబంధనలను అతిక్రమించి కబేలాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్‌డిఒ కిషోర్ హెచ్చరించారు. మంగళవారం నియోజవర్గ స్థాయి పసుమాంస వర్తకులతో మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజవర్గ పరిధిలో అక్రమ పశు రవాణా, కబేలాలు నిర్వహించిన, పశు విక్రయాలు చేసిన, గోవధ చేసిన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనుమతులు ఉన్న కబేలాలోనే మాంసం విక్రయాలు కటింగ్ చేయాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ పశువులు వధ చేస్తూ ఉంటే కేసులు ఉనమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. మాంసం విక్రయిదారులందరూ ఈ సూచనలు తప్పక పాటించాలని లేకుంటే సివిల్ క్రిమినల్ కేసులకు బాధ్యులు అవ్వవలసి ఉంటుందని హెచ్చరించారు. మాంసం విక్రయాలే మాకు జీవనాధారమని, జిల్లా వ్యాప్తంగా లేని రూల్ పిఠాపురంలో అమలు చేయడంపై వర్తకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాలను తప్పనిసరిగా విక్రయదారులు పాటించాలని ఆర్‌డిఒ సూచించారు. ఈ సమావేశంలో సిఐ జి.శ్రీనివాస్, కమిషనర్ నామ కనకారావు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పాల్గొన్నారు.

చెడు అలవాట్లతో జీవితాలు నాశనం

ప్రజాశక్తి - గండేపల్లి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారితే జీవితాలు నాశనం అవుతాయని ఎస్ఐ ఎన్.రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలం రామేశ్వరం పేట ప్రగతి కళాశాలలో చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలు, హెల్మెట్ ధరించడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, సిగరెట్ తాగటం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం ప్రతినిధులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల టిడిపి కార్యదర్శి కట్ట త్రిమూర్తులు పుట్టిన రోజును పురష్కరించుకుని స్థానిక పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ధూళిపూడి బాబి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమంలో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. అనంతరం రోగులకు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎంఎల్ఎ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, సత్య, వినోద్ రాజు, వేగేశ్న భాస్కర్ రాజు పాల్గొన్నారు.


కోనో కార్పస్ చెట్ల తొలగింపు పర్యవేక్షిస్తున్న కమిషనర్, డిఎఫ్ఒ

వేగంగా కోనోకార్పస్ చెట్ల తొలగింపు

ప్రజాశక్తి - కాకినాడ

పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే కోనోకార్పస్ చెట్ల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేసినట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, డిఎఫ్ఒ ఎస్.భరణి తెలిపారు. కలెక్టర్ షాన్ మోహన్ ఇచ్చిన ఆదేశాలతో మంగళవారం జన్మభూమి పార్క్, బోట్ క్లబ్ పార్కులో కోనోకార్పస్ చెట్ల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. చెట్ల తొలగింపు ప్రక్రియను వారు పరిశీలించారు. నగరంలోని వివిధ పార్కుల్లో సుమారు 500 కోనోకార్పస్ చెట్లు ఉండగా ఒక్క బోట్ క్లబ్ పార్క్‌లోనే 100 చెట్లు ఉండటంతో వాటిని తొలుతగా తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా తొలగించిన చెట్ల స్థానంలో టబూబియా బాటిల్ ఫ్రెష్, వెదురు వంటి మొక్కలను నాటే అంశంపై చర్చించారు. కళాశాలలు, పాఠశాలల్లో ఉన్న చెట్లను దశలవారీగా తొలగిస్తామన్నారు.

50 శాతం రాయితీపై చిరుధాన్యాల విత్తనాలు

ప్రజాశక్తి - గండేపల్లి

చిరుధాన్యాల సాగును పెంపుదల చేసే లక్ష్యంతో ప్రభుత్వం 50 శాతం రాయితీపై చిరుధాన్యాలు విత్తనాలను అందిస్తుందని వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి తెలిపారు. మంగళవారం మండలం గోపాలపురం గ్రామంలో చిరుధాన్యాలు సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిరుధాన్యాలు సాగు విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. 50 శాతం రాయితీపై విత్తనాలు అందజేసి, సాగు మెలకువలు పాటించేలా చూసి మళ్ళీ ప్రభుత్వం కొనుగోలు చేసే భరోసా ఇస్తోందన్నారు. మెరక, మూడు సంవత్సరాల వయసు లోపు పామాయిల్ తోటలలో రాగులు, కొర్రలు మొదలగు చిరుధాన్యాలు సాగుచేసి అధిక ఫలసాయం పొందవచ్చునని అన్నారు. అర్హులైన ప్రతి కౌలు రైతు కౌలు కార్డు పొంది ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, విఎఎ అలీషా, విహెచ్ఎ కనకయ్య, రైతులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహాత్మా గాంధీ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో వికలాంగ బాలలకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని బాలల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒలు ప్రభాకర శర్మ, చౌదరి సూచించారు. మంగళవారం ఫిజియోథెరపీ కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బి.అపర్ణ, భవిత సిబ్బంది పి.దుర్గాప్రసాద్‌రెడ్డి, పి.ఆనందరావు పాల్గొన్నారు.

హుస్సేన్‌పురంలో డస్ట్ బిన్‌ల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట


ప్రజలకు డస్ట్‌బిన్స్‌ను అందిస్తున్న నాయకులు

మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో ప్రజలకు డస్ట్ బిన్‌లు పంపిణీ చేశారు. గ్రామ నాయకులు బుజ్జి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తడి చెత్త ,పొడి చెత్త వేయుటకు ప్రత్యేక డస్ట్ బిన్లను అందించి పరిసరాల పరిశుభ్రత, గ్రామంలో దోమలు పెరగకుండా, సీజనల్ వ్యాదులు ప్రభలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కర్రి శ్రీనివాస్, వెల్ఫేర్ అధికారి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సమాచారంతో సమావేశాలకు హాజరవ్వాలి : నెహ్రూ

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండల పరిషత్ సమావేశాలకు అధికారులంతా సమగ్ర సమాచారంతో హాజరుకావాలని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి తోట రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండలంలో వివిధ ప్రభుత్వ శాఖల వివరాలపై ఎంఎల్ఎ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ జ్యోతుల మాట్లాడుతూ మండలంలోని ప్రతి శాఖకు చెందిన అధికారి తప్పనిసరిగా సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేలా చూడాలని ఎంపిడిఒ రాజేశ్వరరావును ఆదేశించారు. సమావేశానికి హాజరయ్యే ప్రతి అధికారి రెండు రోజుల ముందు సమగ్రమైన సమాచారాన్ని ప్రతుల రూపంలో ప్రతి ఒక్క సభ్యునికి అందజేసి దానిపై సమగ్రంగా చర్చించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో ప్రస్తుతం ఉన్న రహదారుల పరిస్థితి, వాటిని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను సమగ్ర నివేదికతో అందజేయాలని నెహ్రూ రహదారుల శాఖ అధికారులను కోరారు. ప్రస్తుతం డయేరియా వ్యాపిస్తున్న తరుణంలో రూరల్ వాటర్ సప్లై మరియు పంచాయతీ మరియు వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో ప్రతి వారం రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులను పరిశీలించి 15 రోజులకు ఒకసారి వాటిని శుభ్రపరచాలని ఆదేశించారు. తొలుత ఎంఎల్ఏగా ఎన్నికై తొలిసారిగా సమావేశానికి హాజరైన ఎంఎల్ఎకు ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి తోట గాంధీ, వైస్ ఎంపిపిలు, ఎంపిడిఒ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల మెరుగుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్
- విద్యా, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులతో సమావేశం

ప్రజాశక్తి-అమలాపురం


సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు విద్యా, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులతో సమావేశం నిర్వహించి విద్య వ్యాప్తికై ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును ఆయన సమీక్షించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణాలలో ఉద్యాన, కృషి విజ్ఞాన కేంద్రాలసమన్వయంతో న్యూట్రిషన్ గార్డెన్స్ పెంపకానికి చర్యలు చేపట్టి, మధ్యాహ్న భోజన పథకంలో ఆయా ఉత్పత్తుల ద్వారా పోషకాహారాన్ని పిల్లలకు అందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఉన్నత చదువులకు తొలిమెట్టైన పదో తరగతి లో ఫెయిల్ అయిన విద్యా ర్థులు మరల సప్లమెంటరీ పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టి ప్రతి ఒక్కరూ కనీస విద్యా ప్రమాణాలు అభ్యసించేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం గోరు ముద్ద అమలులో మెనూ తప్పని సరిగా పాటించాలని ఆదేశించారు. పాఠశాలల్లో సీజనల్ వ్యాధులు అనారోగ్యాల బారిన పడకుండా ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ద్వారా సురక్షిత తాగునీటిని అందించాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాల కల్పనకు కూడా స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల సహకారంతో కృషి చేయాలన్నారు. విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రతి విద్యార్థి పాఠశాలల్లో విద్యను అభ్యసించాల్సిన అవసరం ఉందన్నారు. బడి బయట ఉన్న పిల్లల్లో తరగతి తగ్గ కనీస సామర్థ్యాలు లేని పక్షంలో ప్రత్యామ్నాయ బడులు ఏర్పాటు చేసి ఆ తరగతికి దగ్గ సామర్థ్యాలు పెంపొందించి తదుపరి రెగ్యులర్ పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. గ్రంథాల యాల ద్వారా మరింతగా పాఠ్యాంశాల పట్ల జనరల్ నాలెడ్జ్ పట్ల జ్ఞానాన్ని పెంపొందించుకునే విధంగా నిర్వహణ తీరు ఉండాలన్నారు. గుణాత్మకమైన నాణ్యమైన విద్యను అభ్యసింపజేసి ఫార్మేటివ్ సెమిస్టర్ పరీక్షలు సకాలంలో నిర్వహిస్తూ పబ్లిక్ బోర్డు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణతా శాతాన్ని తీసుకుని వచ్చి జిల్లా ను విద్యాపరంగా ముందంజలో నిలపాలని సూచించారు. సమగ్ర శిక్ష అభియాన్ కార్యక్రమలపై సమీక్షిస్తూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు భవిత కేంద్రాల ద్వారా ఫిజియోదేరపి, వైద్య విధానాల ద్వారా వికలాంగత్వాన్ని అధిగమించి సకలాం గులుగా మారేందుకు చిత్తశుద్ధితో పాటుప డాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధుల ద్వారా ల్యాబ్లు ఆట స్థలాలు వంటి మౌలిక సదుపాయా లు కల్పించి చదువుతోపాటు పరిశోధ నాత్మక విజ్ఞానం పెంపొందించి క్రీడా రంగంలో రాణించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్ష అభియాన్ సహాయ ప్రోగ్రాం అధికారి మధుసూదన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, సిఎంఒ, ఎఎంఒలు తదితరులు పాల్గొన్నారు.

12న రావులపాలెంలో ఉద్యోగ మేళా


ప్రజాశక్తి-ముమ్మిడివరం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న రావులపాలెంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రావులపాలెం లోని గోపాలపురం అవంతి ఫుడ్స్ కంపెనీలో సుమారు 90కి పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన నిరుద్యోగ యువతి, యువకులకు మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తా రన్నారు. ఎస్ఎస్‌సి పాసై డిప్లమో, ఐటిఐ, మరియు ఏదైనా డిగ్రీ పాసైన లేదా ఫెయిల్ అయిన వారుకూడా అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు బయోడేటా ఐడి అడ్రస్ ప్రూఫ్ పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు 15 రోజులపాటు శిక్షణ ఇస్తారని నైపుణ్యాభివృద్ధి అధికారి తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 8247 645389ను సంప్రదించాలన్నారు.

పారిశుధ్యం అధ్వానం

ప్రజాశక్తి-అయినవిల్లి

మండలంలోని సిరిపల్లి పంచాయతీ పరిధిలోని చిల్లే వారి పేటను ఆనుకుని ఉన్న వీధి కాలువల్లో మురుగు, చెత్త చెదారం పేరుకుపోయింది. దీంతో పారిశుధ్యం అధ్వానం మారడంతో ప్రజలు నానా అవస్థలూ పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు ఎటూ దిగక ప్లాస్టిక్ బాటిళ్లు,కవర్లు, ఇతర చెత్తాచెదారం వీధికాలువల్లో పేరుకుపోయాయి. వీటిని రోజుల తరబడి తొలగించకుండా ఉంచడంతో దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీధి కాలువల్లో పేరుకుపోయిన మురుగుతో దోమలు వృద్ధి చెందాయి. దీంతో అనేక మంది వ్యాధులు బారిన పడుతున్నారని స్థానికులు, కాలనీవాసులు వాపోతున్నారు. దీనిపై పంచాయతీకి, సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి మురుగుకాలువలను శుభ్రం చేయాలన్నారు. అదేవిధంగా దోమల నిర్మూలనకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


చిల్లేవారిపేట వద్ద వ్యర్థాలతో పూడుకుపోయిన వీధి కాలువ